క్లుప్తంగా

పూజా కైంకర్యాల సామగ్రి అందజేత

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని అయ్యలూరివారిపల్లె తిరుమలకొండ ప్రసిద్ధ పుణ్య క్షేత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీతిరుమలనాథ స్వామి ఆలయానికి ఒంగోలుకు చెందిన దాతలు గురువారం పూజా కైంకర్యాల సామగ్రిని ఆలయ అర్చకులు రామమూర్తికి అందజేశారు. ఈసందర్భంగా దాతలు జాజుల శ్యామ్ ప్రసాద్, మనోజ దంపతులు స్వామివారికి శఠగోపం, అక్షింతలపళ్లెం, అర్చనలో ఉపయోగించే పూలపళ్లెలను స్వామివారికి అందజేశారు. ఈసందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించి దాతలకు తీర్థప్రసాదాలు, వేద ఆశీర్వచనం అందజేశారు. రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పూరి గుడిసె దగ్ధం

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని కందుర్లగుంట అగ్రహారం ఎస్టీకాలనీలో గురువారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో కాలనీకి చెందిన సవరం పోలయ్య, హేసన్నమ్మలకు చెందిన పూరిగుడిసె పూర్తిగా దగ్ధమయింది. సాయంత్రం హేసన్నమ్మ గుడిసెలో వంట చేస్తోంది. నిప్పురవ్వలు ప్రమాదవశాత్తు పూరిగుడిసెకు అంటుకుని పూర్తిగా కాలిపోయింది. సుమారు రు.1.30 లక్షల నష్టంజరిగినట్లు తెలిపారు.

ముక్కోటికి ముస్తాబైన ఆలయాలు



ముక్కోటి ఉత్తర ద్వార దర్శన వేడుకలకు ముస్తాబైన వేణుగోపాలస్వామి ఆలయం

పామూరు: మండల కేంద్రమైన పామూరులోని రుక్మిణి, సత్యభామా సమేత శ్రీమదన వేణుగోపాలస్వామి ఆలయం, వరదరాజస్వామి ఆలయం, వల్లీ భుజంగేశ్వర ఆలయాలు ముస్తాబయ్యాయి. ఈసందర్భంగా ఈఓ ఎస్‌జీఆర్ నరసింహబాబు ఆధ్వర్యంలో ఆలయాలను ప్రత్యేక విద్యుద్దీపాలంకరణతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. శుక్రవారం భక్తుల దర్శనానంతరం ఉదయం 10.30 గంటలకు స్వామివార్ల ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ తెలిపారు.

రైతులకు భరోసా ఎక్కడ?

- ఆర్భాటాలకే పరిమితమైన పొలం పిలుస్తోంది
- కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు డుమ్మా
- అన్నదాతలకు అందని సలహాలు, సూచనలు
- ఫొటోలతో సరిపెట్టుకుంటున్న వైనం



పొలం పొలుస్తోంది కార్యక్రమంలో వరినాటుతూ ఫొటో దిగుతున్న అధికారులు (ఫైల్)

లింగసముద్రం: అన్నదాతలంటే అధికారులకు అలుసుగా మారింది. వారికి సలహాలు, సూచనలు ఇవ్వడానికి మనసు రావడంలేదు. రైతు శ్రేయస్సే లక్ష్యంగా నూతన సాగు పద్ధతులు, నూతన వంగడాల పరిచయం, వ్యవసాయంలో నూతన శాస్త్ర సాంకేతిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించడం కోసం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా పండిన పంటకు మార్కెటింగ్, గిట్టుబాటు ధర, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగించాల్సి ఉంటుంది.

అయితే వ్యవసాయం, దాని అనుబంధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించాల్సి ఉన్నా అధికారులు మొక్కుబడిగా పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కందుకూరు నియోజకవర్గంలోని కందుకూరు, ఉలవపాడు, గుడ్లూరు, లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల్లో వ్యవసాయాధికారులు మాత్రమే పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో పాల్గొని నిర్వహిస్తున్నారు. ఐదు మండలాల్లోని పంచాయతీల్లో సెప్టెంబర్ నెల 24న ప్రారంభమైన కార్యక్రమం 2025 జనవరి 2 వరకు ఈ కార్యక్రమాల్లో నిర్వహించాల్సి ఉంది.

వారంలో రెండు రోజుల పాటు మంగళ, బుధ వారాల్లో కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించారు. రోజుకు రెండు గ్రామాల చొప్పున ప్రతి వారం నాలుగు గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించాల్సి ఉంది. వ్యవసాయ శాఖలతో పాటు ఆత్మ, సెరికల్చర్, ఉద్యానశాఖ, పశుసంవర్ధక శాఖ, ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్, కోఆపరేటివ్ ఫెడరేషన్, మత్స్య, మార్కెటింగ్ శాఖ, ఇరిగేషన్, విద్యుత్, ప్రకృతి వ్యవసాయశాఖ తదితర సూమారు 10 శాఖల అధికారులు విధిగా హాజరు కావాల్సి ఉండగా ఒకటి రెండు శాఖల అధికారులు మాత్రమే హాజరవుతున్నారు.

పంట పొలాలల్లో ఫొటోలు దిగుతూ..

ఖరీఫ్‌లో రెగ్యులర్ పంటలతో పాటు మామిడి, తైవాన్ జామ, నిమ్మ తోటలు సాగులో ఉన్నా రైతులకు అధికారులు ఎటువంటి సలహాలు, సూచనలు ఇచ్చిన పాపానపోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. రబీ సీజన్‌లో మాత్రం వ్యవసాయ అధికారులు ముందుగానే కొందరు రైతులను ఎంపిక చేసుకుని వారి పంట పొలాల్లోకి వెళ్లి ఫొటోలు దిగి కార్యక్రమం పూర్తయినట్లు వెళ్లిపోతున్నారు. రైతులకు సాగు వ్యయం తగ్గింపు చర్యలపై అధికారులు అవగాహన కల్పించాల్సి ఉంది. నూతన సాగు పద్ధతులు, మేలు రకాల వంగడాలు, ఉత్తమ సాగు ఫలితాలపై అధికారులు క్షేత్ర స్థాయిలో రైతులను చైతన్య పరచాలి. వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమాలు ఏర్పాటు చేసి పంటలపై రైతుల అనుమానాలు నివృత్తి చేయాలి. అయితే అన్ని శాఖల అధికారులు హాజరు కాకాపోవడంతో మొక్కుబడిగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పంటలను పరిశీలిస్తున్నాం

రైతు సేవా కేంద్రం పరిధిలోని గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. కొన్నిశాఖల అధికారులు మాత్రమే ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు. వారు రైతులకు సూచనలు కూడా ఇస్తున్నారు. పంట పొలాలను కూడా పరిశీలించి మందుల పిచికారీలో సూచనలు చేస్తున్నాం. ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయ సమాయకులను పంటల వద్దకు పంపించి ఇ-క్రాప్ చేయడంతో పాటు పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– టి.అబ్రహంలింకన్, మండల వ్యవసాయాధికారి, లింగసముద్రం మండలం

చీడపీడలపై సూచనలు లేవు



నేను ఐదెకరాల్లో మిర్చి పంటను సాగు చేస్తున్నా. గత నాలుగు సంవత్సరాల నుంచి సాగు చేస్తున్నా. మాగ్రామానికి వ్యవసాయ సహాయకులు తప్ప ఇతర అధికారులు ఎవరూ రాలేదు. చీడపీడల నివారణకు అధికారులు ఎటువంటి సూచనలు ఇవ్వటం లేదు. పురుగు మందుల షాపుల వద్దకు వెళ్లి మందులు తీసుకుంటున్నాం. అధికారులు మిర్చి తోటలను పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చినట్లైతే పంటపై సరైన మందు పిచికారీ చేయవచ్చు.

–మద్దెల రవి, రాళ్లపాడు, లింగసముద్రం మండలం

పంటలను పరిశీలించకుండానే వెళ్లిపోతున్నారు



అధికారులు రైతు సేవా కేంద్రాల్లో మొక్కుబడిగా పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పొలాల్లోకి వెళ్లి పంటను పరిశీలించడంలేదు. పంటలపై కొందరు రైతులకు అవగాహన లేకపోవడంతో ఫర్టిలైజర్స్ షాపులకు వెళ్లి వారు ఇచ్చిన మందును పిచికారీ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు పంటలను పరిశీలించి సలహాలు, సూచనలు ఇస్తే బాగుంటుంది.

–కనపర్తి రంగయ్య, మేదరమిట్లపాలెం

తిరుపతి ఘటనకు బాధ్యులను శిక్షించాలి

- వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు శేషారెడ్డి



కనపర్తి శేషారెడ్డి

సింగరాయకొండ: వెంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన భక్తులను 7 గురిని ఏకంగా తమ నిర్లక్ష్యంతో సరాసరి వైకుంఠానికి పంపించి 34 మందిని ఆస్పత్రిపాలు చేసిన టీటీడీ దేవస్థాన చైర్మన్ బీఆర్ నాయుడు, జేఈఓ వెంకన్న చౌదరి, ఈఓ శ్యామలా రావు, ఎస్పీ సుబ్బారాయుడులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు కనపర్తి శేషారెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత 5 సంవత్సరాల్లో ఒక్కసారి కూడా తిరుపతి రాని చైర్మన్ బీఆర్ నాయుడుకు ముక్కోటి ఏకాదశి నాడు భక్తుల రద్దీ ఏవిధంగా ఉంటుందో ఏం తెలుస్తుందని విమర్శించారు. దర్శన టిక్కెట్ల విక్రయంలో టోకెన్ పద్ధతి కొంపముంచిందని ఆంధ్రజ్యోతి దినపత్రిక ఆరోపించటం ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో చైర్మన్‌గా విధులు నిర్వహించిన వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర రెడ్డి ఎంతో బాధ్యతగా వ్యవహరించారని.. ఒక్క దుర్ఘటన కూడా జరగలేదని గుర్తు చేశారు. కేవలం అధికారుల నిర్లక్ష్యమే ఈ దుర్ఘటనకు కారణమన్నారు. సనాతనధర్మాన్ని కాపాడండని పదే పదే గోల చేసే సనాతన నాథుడు తిరుపతి దుర్ఘటనపై స్పందించక పోవటం సిగ్గుచేటన్నారు. ఇటీవల ఈ తరహా ఘటనలో అల్లు అర్జున్‌ను అరెస్టు చేశారని అదే ప్రకారం నేడు ఈ ఘటనకు కారకులైన వారిని కూడా అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం వహించిన ఎస్పీ, ఈఓలను కఠినంగా శిక్షించకుండా బదిలీ చేయటం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. మృతి చెందిన వారికి ఒక్కొక్కరికి కోటి రూపాయలు, గాయాలపాలయిన వారికి ఒక్కొక్కరికి 20 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

దశదిన కర్మలో పాల్గొన్న వెంకయ్య



వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డాక్టర్ వెంకయ్య

కొండపి: మండలంలోని గోగినేనివారి పాలెం గ్రామంలో బుధవారం నిర్వహించిన బొడ్డపాటి వెంకటేశ్వర్లు దశదినకర్మకు మాజీ పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా బొడ్డపాటి వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యాన్ని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ గోగినేని వెంకటేశ్వరరావు, చింతల ఎక్సోర్డ్ అధినేత చింతల వెంకటేశ్వర్లు, చింతల సుబ్బారావు, సుబ్బారావు, మండల సీనియర్ నాయకులు మారెడ్డి వెంకటాద్రి రెడ్డి, వేముల రమేష్, సుధాకర్, రాజు పాల్గొన్నారు.

పిల్లలకు ఆధార్ నమోదు చేయించాలి



దాదిరెడ్డిపల్లెలో సచివాలయంలో ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

పామూరు: తల్లిదండ్రులు విధిగా తమ పిల్లలకు ఆధార్ నమోదు చేయించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతి అన్నారు. మండలంలోని దాదిరెడ్డిపల్లె సచివాలయంలో గురువారం అంగన్‌వాడీ వయస్సు పిల్లలకు ఆధార్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం తీసుకోవడానికి ఆధార్ విధిగా ఉండాలన్నారు. ఈసందర్భంగా దాదిరెడ్డిపల్లె, చిలంకూరు, చట్టుమడుగు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని పిల్లలకు ఆధార్ నమోదు చేసినట్లు తెలిపారు. ఎమ్మెస్ కేఎం సరోజిని, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీప్రసన్న, విజయకుమారి, ఎలిజబెత్, ఫణికుమారి, షేక్.రజియాబేగం, హెల్పర్స్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు



సింగరాయకొండ: భోగిమంటలతో విద్యార్థులు



బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు సూసన్నకుమార్



భోగి మంట వేస్తున్న విద్యార్థులు

పామూరు:

మండల కేంద్రమైన పామూరుతో పాటు మండలంలోని పలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల కేంద్రమైన పామూరు జీహెచ్ఎస్‌లో హెచ్‌ఎం యం.రామస్వామి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు, పలువిధాల ఆటల పోటీలు, పిండి వంటలకాల ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం వేడుకగా ఉపాధ్యాయులు, విద్యార్థులు భోగిమంటలు వేశారు. వారు మాట్లాడుతూ పాఠశాలల్లో కుల, మత భేదాలు లేకుండా అంతా ఒక్కటిగా తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా సంక్రాంతి సంబరాలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. పాఠశాల పీడీ మస్తాన్‌బీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం (పామూరు): సంక్రాంతి పర్వదిన ముందస్తు సంబరాలు మండల కేంద్రమైన సీఎస్‌పురంతోపాటు మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. మండలంలోని తిమ్మరాజుపల్లె ఎంపీపీఎస్‌లో నిర్వహించిన సంక్రాంతి సంబరాల వేషధారణలు అలరించాయి. అదేవిధంగా సీఎస్‌పురం పాఠశాలల్లో వేసిన భోగిమంటలు, హరిదాసుల వేషధారణలు, సాంస్కతిక కార్యక్రమాలు, నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బెల్లంకొండ శ్రీనివాసులు, డి.చెన్నకేశవులు, ఎస్‌యంసీ చైర్మన్ గుత్తి కొండలరావు పాల్గొన్నారు.

హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు

టంగుటూరు: మండలంలోని ఆలకురుపాడు జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో రంగుల ముగ్గులు వేసి గాలిపటాలని ఎగరవేసి భోగిమంట వేసి సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం విద్యార్థులకు సంక్రాంతి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆలం రామారావు, దాత దామచర్ల శ్రీధర్ బాబు, చెన్నయ్య, సుబ్బారావు, సుభాషిని, జ్యోతి, విజయలక్ష్మి ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఏరువారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



తిమ్మరాజుపల్లెలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కనిగిరి రూరల్: తెలుగువారి సంస్కృతి, సంప్రదాయనికి అద్దం పట్టే సంక్రాంతి సంబరాలను ముందస్తుగా మండలంలోని కొత్త ఏరువారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు హరిదాసుల వేషాధారణలు, రంగువల్లుల ముగ్గల్లో, గొబ్బెమ్మల సింగారింపులు, భోగి మంటలు, పలు ఆటల పోటీలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పల్లెంతా ముందస్తు సంక్రాంతి సంబరాలతో హోరెత్తింది. పాఠశాల హెచ్‌ఎం ఎస్‌కే మహబూబ్ ముంతాజ్ ఆధ్వర్యంలో వివిధ పోటీల్లోని విజేతలకు బహుమతులు అందచేశారు. విశ్రాంత ఎంఈఓ నాగిరెడ్డి, ఉపాధ్మాయులు, పీఈటీలు, స్థానికులు పాల్గొన్నారు.

కొండపి: మండలంలోని కె. ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలను ప్రధానోపాధ్యాయుడు వి. సూసన్నకుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి ప్రాముఖ్యత వివరించారు. కమిటీ చైర్మన్ నల్లమోతు బ్రహ్మయ్య, మాజీ కమిటీ చైర్మన్ రాఘవేంద్ర శర్మ, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సింగరాయకొండ: స్థానిక శ్రీ విద్యానికేతన్ హైస్కూలు లో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చిన్నారులు హరిదాసు వేషధారణలో అలరించారు. భోగిమంటలు వేసుకుని సంబరాలు జరిపారు. కరస్పాండెంట్ సైకం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పండుగ సాంప్రదాయాలు కనుమరుగవుతున్న ఈ రోజుల్లో సంక్రాంతి సంబరాలను కళ్లకు ఉట్టిపడేలా జరుపుకోవటం ఆనందంగా ఉందన్నారు.



ఏరువారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



సీఎస్‌పురంలో భోగి మంటలు వేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



పామూరు జీహెచ్‌ఎస్‌లో సంక్రాంతి ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

పొగాకు బ్యారన్ దగ్ధం



కెల్లంపల్లిలో అగ్నికి ఆహుతైన పొగాకు బ్యారన్

మర్రిపూడి: పొగాకు బ్యారన్ క్యూరింగ్ జరుగుతుండగా ప్రమాదవశాత్తు దగ్ధమైన సంఘటన మండలంలోని కెల్లంపల్లి గ్రామంలో గురువారం జరిగింది. మండలంలోని కెల్లంపల్లి గ్రామానికి చెందిన మోతుకూరి శ్రీను, బైరపునేని ధనలక్ష్మికి చెందిన పొగాకు బ్యారన్ లో సుమారు 1300 పొగాకు కర్ర క్యూరింగ్ చేస్తుండగా కర్ర మొద్దు గొట్టంపై పడి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. ఈ సంఘటనలో టైర్లు, అల్లుడుకర్ర, గొట్టాలు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ. 3లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న దర్శి అగ్రిమాపక అధికారి జాలయ్య తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేసే ప్రయత్నం ఫలించలేదు.

ఉత్తర ద్వార దర్శనం నేడు

కనిగిరి రూరల్: పట్టణంలోని పలు ఆలయాల్లో శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం జరుగుతుందని ఆయా ఆలయ కమిటీలు తెలిపారు. పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం జరుగుతుందని తెలిపారు. దేవాంగ నగర్‌లోని కేటీఆర్ స్కూల్ ఆవరణలో గల శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని స్వామివారి ఉత్తర ద్వార దర్శనం జరుగుతుందన్నారు. స్థానిక షిరిడీ సాయిబాబా దేవస్థానంలో ముక్కోటి పర్వదినం పురస్కరించుకుని శ్రీ సీతారాముల స్వామి వారికి ఉత్తర ద్వార దివ్య దర్శన ప్రాప్తి కలుగునని ఆలయ అర్చకులు మునగంటి మణికంఠ చార్య తెలిపారు.

గురుకుల పాఠశాలలో గ్రామ సభ

కొండపి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సామాజిక తనిఖీ బృందం వారు గురువారం గ్రామ సభను ఏర్పాటు చేశారు. తల్లిదండ్రులతో పలు అంశాలు చర్చించారు. ప్రిన్సిపాల్ అరుణ, ఎంఈఓ 2 రామారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సంక్రాంతి సెలవులు

కొండపి: మండలంలో శుక్రవారం నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఇస్తున్నట్లు ఎంఈఓ 1 కె. సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నేటి నుంచి 19వ తేదీ వరకు పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రభుత్వ సెలవు దినాల్లో ఎవరైనా పాఠశాల నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే ఆ పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా నాగూర్ మీరా స్వామి గంధ మహోత్సవం



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: స్థానిక చెక్‌పోస్టు వద్ద గల హజరత్ ఖాదర్‌వలి (నాగూర్ మీరా స్వామి) దర్గా గంధమహోత్సవ వేడుకలను గురువారం రాత్రి కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. హజరత్ వారి జెండాను మేళ తాళాలతో పట్టణ పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ ప్రత్యేక పూజలు చేశారు. న్యాయవాది ఎస్‌కే సుమైర్, విజేత విద్యాసంస్థల అధినేత పసుపులేటి అరుణోధర్, ఉప్పుటూరి గురుస్వామి, థెరిస్సా సేవా సమితి అధ్యక్షుడు ఎస్ఎస్ రసూల్, సయ్యద్ నాయబ, సమద్, దర్గా నిర్వాహకులు ఎస్‌కే మదీనా షఫీ, ఖాదర్ జిలాని, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కనిగిరి రూరల్: పొగాకు రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించి ఉత్పత్తి చేసినప్పుడే గిట్టుబాటు ధర లభిస్తోందని టుబాకో బోర్డు వేలం నిర్వాహణ అధికారి బి. కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని బల్లిపల్లి, వెలిగండ్ల గ్రామాల్లో పొగాకు ఎగుమతులలో పురుగుమందుల అవశేషాలు, పొగాకేతర, అన్యపదార్థాల వలన కలిగే ప్రతి కూల పరిస్థితులపై అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. వేలం అధికారి బి. కోటేశ్వరరావు మాట్లాడుతూ పొగాకులో అనుమతి లేని పురుగుల మందులు అధిక మోతాదులో వాడటం వలన భారతీయ పొగాకుకు అంతర్జాతీయ మార్కెట్‌లో ఎదురు దెబ్బ తగిలే అవకాశం ఉందన్నారు. పొగాకులో అన్య పదార్థాలు కలవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సాగులో పెట్టుబడి ఖర్చు తగ్గింపు మీద దృష్టి పెట్టాలన్నారు. అనుమతి లేకుండా బ్యారన్‌ల నిర్మాణాలు చేపట్ట వద్దని చెప్పారు. బోర్డు అధికారులు ఎస్‌వీకే ప్రసాద్, వెంకట్ రావు, శ్రీనివాస్, ప్రత్యూషా పాల్గొన్నారు.

త్వరలో ప్రజా ఉద్యమం

కనిగిరి రూరల్: అత్యంత వెనుకబడిన, ఫ్లోరైడ్ ప్రాంతమైన పశ్చిమ ప్రకాశం ప్రజలకు సురక్షిత జలాలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జీవీ కొండారెడ్డి అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో సీపీఎం సమావేశం గురువారం జరిగింది. దేశంలోనే ఎక్కువ ఫ్లోరైడ్ ఉన్న 15 జిల్లాల్లో ప్రకాశం జిల్లా 14వ స్థానంలో ఉందని పేర్కొన్నారు. అనేక మంది ఎముకలు, నరాలు, కీళ్లు, కిడ్నీ తదితర వ్యాధుల సమస్యలతో అల్లాడుతున్నారన్నారు. నీటి సమస్య పరిష్కారానికి జలజీవన్ మిషన్ పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈనెల 23న కనిగిరిలో వెలిగొండ జలాల సాధనకు సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. పిల్లి తిప్పారెడ్డి, ఎస్‌కే బషీరా, వెంకటమ్మ, నరేంద్ర, శాంతకుమారి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న దద్దాల నారాయణ యాదవ్, పార్టీ నేతలు

కనిగిరి రూరల్: క్రీడలు యువతలో ఐక్యతను, స్నేహభావాన్ని, పట్టుదలను పెంపొందిస్తాయని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. మండలంలోని వాగుపల్లి పార్టీ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలను గురువారం పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. క్రీడా పోటీల్లో గెలుపు ఓటములు సహజం అన్నారు. అనంతరం యువతలో కలిసి కొద్ది సేపు క్రికెట్ ఆడి ఉత్సాహ పరిచారు. ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ ఓకేరెడ్డి, సూరసాని మోహన్‌రెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, వాగుపల్లి సర్పంచ్ మూలే గోవిందారెడ్డి, సర్పంచ్‌లు ముద్దాబాబు, స్వర్ణ ఏడుకొండలురెడ్డి, మూలే గోపాల్‌రెడ్డి, భూమిరెడ్డి కొండారెడ్డి, రవి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, మాజీ ఎంపీటీసీ సురేష్ బాబు, సంగు కృష్ణారెడ్డి, సంగు వెంకటేశ్వరరెడ్డి, కటికల వెంకటరత్నం, పల్నాటి భాస్కర్‌రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, మడతల వెంకటేశ్వర రెడ్డి, దేవిరెడ్డి వెంకటస్వామి రెడ్డి, మూలే రాజశేఖరరెడ్డి, గ్రామ పార్టీ యూత్ నాయకులు వీరంరెడ్డి బాబు, వెంకటేశ్వరరావు, నాగేంద్రబాబు, నరేష్, మల్యాద్రి, మురళీ, ప్రసంగి, బాబు, చిన్న మీరయ్య, మల్లికార్జున, కోటయ్య, నాగయ్య, ఆరోన్ ఏసు తదితరులు పాల్గొన్నారు.